# తాతయ్య మురిపెం

సుబ్బయ్యతాతని అంతా డబ్బుల తాతయ్య అని పిలుస్తూండేవాళ్ళం. బంధుకోటిలో ఎవరింట ఏ ముచ్చట జరిగినా పదిమంది చేరినప్పుడు పిల్లలంతా ఆయనకోసం గాలిస్తూండేవాళ్ళం. "సుబ్బయ్య ఇంకా రాలేదూ?" అని మాతోపాటు పెద్దవాళ్ళుకూడా పదిమార్లు అనుకుంటూండేవాళ్ళు. ఆయన రాగానే పిల్లలందర్నీ చుట్టూతా కూర్చోబెట్టుకుని కోటుజేబులోంచి గుప్పిళ్ళకొద్దీ చిల్లర తీసి ఎదురుగా పోసుకుని మిఠాయి పంచిపెట్టినట్టుగా పిల్లలకి పంచిపెట్టేవాడు. ఆయన వున్న నాలుగు రోజులూ మాకు చిరుతిండి దండిగా పడుతూండేది. ఒక్క నిమిషం ఆయన్ని విడిచిపెట్టి వుండేవాళ్ళం కాం. ఆఖరికి భోజనందగ్గరకూడా అంతా పంతాలుపడి ఆయన చుట్టూతా కూచుని తలోముద్దా ఆయన చేత చేతిలో వేయించుకుని తింటేగాని మాకు తృప్తిగా ఉండేది కాదు. పిల్లల్తో సమానంగా ఆడుతూ పాడుతూండే

వాడు. తాతయ్యదగ్గర పేకముక్కలు ఉండేవి. వాటితో గార డీలు చేస్తూండేవాడు. అమ్మమ్మ దగ్గర చనువు వుండేదిగాని తాతయ్య దగ్గరున్న ఆకర్షణ ఉండేదికాదు.

డబ్బుల తాతయ్యకు ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడ పిల్లలు పుట్టారు. ఏడాది, రెండేళ్ళు పెరిగి ఇద్దరాడపిల్లలు, ఒక మొగపిల్లవాడు పోయారు. ఇక మిగిలిందల్లా ఆఖరివాడు సూర్యనారాయణ ఒక్కడే. వాడు నాకంటే నాలుగేళ్ళు పెద్ద.

"ఒరే నీ పేరేంవిటిరా?" అని ఎవరమైనా అడుగుతే "తూల్యం" అని చెప్పేవాడు.

"అదేంవిటి తాతయ్యా వాడు అలా అంటాడు?" అని తాతయ్యని అడుగుతే "చిన్న పిల్లవాడు గదట్రా పాపం. మాటలు ఇంకా బాగా రాలేదు" అనేవాడు తాతయ్య.

మామటుకు మాకు వల్లమాలిన ఆశ్చర్యం వేసేది. వాడు మాకంటె నాలుగయిదేళ్ళు పెద్దయినా తాతయ్య ఇలా గంటాడేంవిటా అని ఆశ్చర్యపోయే వాళ్ళం.

అమ్మమ్మ మటుకు ఊరుకునేది కాదు. "తాతయ్య అలాగే అంటారర్రా. గారంమప్పి అలాగే వాడ్ని పాడు చేస్తున్నారు. వాడికి ఒక్క మాటే ఏంవిటి. అన్ని అవలక్షణాలూ ఉన్నాయి" అనేది అమ్మమ్మ.

తాతయ్య సూర్యాన్ని ఒళ్లో కూర్చోబెట్టుకుని "పోవే పండులాంటి వాణ్ణి పట్టుకుని లేనిపోని పేర్లు పెడతావు. అవలక్షణాలు నీకున్నాయి. వాడికేం లేవు. కదరా బాబీ..." అంటూ ముద్దుపెట్టుకునేవాడు. సూర్యం బుగ్గలు తుడుచుకుని బుంగమూతి పెట్టుకుని అమ్మమ్మవైపు కోపంగా

చూస్తూండేవాడు. తాతయ్యంటే మాకు ఎంత అభిమానం ఉన్నా, ఈ విషయంలో అమ్మమ్మ చెప్పిందే నిజం అని మేం అంతా అనుకునేవాళ్ళం. సూర్యం ఏం చేసినా ఎబ్బెట్టుగా అనిపించేది. వాడు నడుస్తుంటే అటూ ఇటూ తాగిన వాడిలా ఊగిపోయేవాడు. అది నడక అని చెప్పటానికి లేకుండా, పరుగు అని చెప్పటానికి లేకుండా ముందుకు పడబోయి ఆపుకున్నట్టుగా తమాషాగా నడిచేవాడు. ఆటల్లో పాటల్లో కలిసేవాడు కాడు. కలిసినా భరించలేని బాధలు పెట్టేవాడు. అందరి కళ్ళల్లోనూ దుమ్ము చల్లి పారిపోయేవాడు. కళ్ళు నలుపుకుంటూ ఏడుస్తూ తాతయ్యతోపోయి ఫిర్యాదుచేస్తే ఓ అణాకాసు చేతుల్లోపెట్టి బుజ్జగించి పంపేసేవాడు తాతయ్య. అమ్మమ్మ చెయ్యిచేసుకోబోతే తాతయ్య వాడ్ని వాటేసుకుని మాదగ్గరికి తీసుకొచ్చేసేవాడు. సూర్యం మాట్లాడుతుంటే నోటివెంబడి చొంగ కారుతుండేది. అరిచేత్తో తుడుచుకొని ఒంటికి పూసుకునేవాడు. నూకంటు పెద్దయినా పగల్లా ఒంటిమీద గుడ్డయినా లేకుండా మొండిమొలతో తిరుగుతూండేవాడు. తొడుగుతే ఉంచుకునేవాడు కాడు. వాడి ప్రతి చర్యనీ మేం వింతగా గమనిస్తూండేవాళ్ళం. వాడు ఏ క్షణంలో ఏపని చేస్తాడో ఎవరికీ తెలిసేది కాదు. ఎత్తైన ప్రహరీ గోడమీంచి ఉన్నట్టుండి కింద ఇసకలో ఆడుకునే పిల్లలమీదికి ఉరికేవాడు. ఒక్కొక్కప్పుడు తాతయ్య జేబులో పెన్ను తీసుకుని అరచేతులంతా సిరా పూసుకుని బుగ్గలు చరుచుకుంటూ అందర్నీ భయపెడుతూండేవాడు.

అన్నిటికంటె వాడు నీళ్ళుపోసుకొనే ఘట్టం చాలా రసవత్తరంగా ఉండేది. అమ్మమ్మ, తాతయ్య వాడికి తినటాని కేదయినా పెట్టి మంచిమాటలాడి, బ్రతిమాలి, మెల్లగా భావిపళ్ళెం దగ్గరికి తీసుకుపోయేవారు. తీరా అక్కడిదాకా వెళ్ళింతర్వాత, శివం ఎత్తినట్టుగా బిర్రబిగుసుకు పోయి చిందులు తొక్కి పెనుగులాడి విడిపించుకొని పారిపోయేవాడు. తాతయ్య వాడ్ని పట్టుకుని లాలిస్తూ మళ్ళీ భావిదగ్గరకు తీసుకొచ్చేవాడు. మేం పళ్ళెంచుట్టూ నిలబడి చోద్యం చూస్తూండేవాళ్ళం. నీళ్ళు పోసుకోవడమన్నది మాకు సమస్య కాదుగా మరి. అమ్మమ్మ వాడి రెక్కలు పట్టుకుని తీసుకు పోతుంటే తాతయ్య వెనకాలే తుండుగుడ్డా, సబ్బుబిళ్ళా పట్టుకొని వాళ్ళిద్దర్ని అనుసరించే దృశ్యం ఇప్పటికీ నా కళ్ళ ముందు మెదులూంటుంది.

భావిపళ్ళెంలో వాడు వెల్లకితలా పడి కాళ్ళు తపతపా బాదుతున్నా, తాతయ్య వాడ్ని గట్టిగా పట్టుకొని అలాగే ఒళ్ళంతా రుద్ది వాడి ఒళ్ళు తుడిచి వాడికి బట్టలు తొడిగి ఆ తతంగం పూర్తయేసరికి తాతయ్యకీ, అమ్మమ్మకీ ముఖాలు కందిపోయి నానా హైరానాలయి శోషవచ్చినంత పనయేది. అప్పుడప్పుడు సూర్యాన్ని ఏ చెట్టుకో పుట్టకో తాడుపెట్టి కట్టేసి మరీ నీళ్ళు పోస్తూండేవాళ్ళు కూడాను. ఈ విషయంలో మట్టుకు తాతయ్య, బాధ్యతంతా అమ్మమ్మమీద వదిలి పెట్టేసేవాడు. ఆవిడ నయాన చెప్పినా, భయాన చెప్పినా, దండించినా ఆయన నోరు మెదిపేవాడు కాదు. కాని లోప లోపల వాడి వంటిమీద పడుతున్న ప్రతిదెబ్బా తనమీద

పడుతున్నట్టుగానే బాధపడుతున్నాడని స్పష్టంగా ఆయన
ముఖం చూస్తే తెలుస్తూనే ఉండేది. అయినా ఏమీ అనే
వాడు కాదు.

అప్పుడప్పుడు అమ్మమ్మ వాడ్ని గురించి కన్నీటితో
ఏదో చెబుతూండటం, తాతయ్య చప్పరించేసి తేలిగ్గా తోసి
పారేస్తూండటం [illegible]మేం గమనిస్తూండే వాళ్ళం.

ఆ తర్వాత కొన్నాళ్ళకి మేమంతా విశాఖపట్నం
వెళ్ళిపోయాం. నాన్నకి ఆవూరు బదిలీ అయింది. మమ్మల్ని
సాగనంపటానికి తాతయ్య, అమ్మమ్మ స్టేషనుకి వచ్చారు.
ఇంకో పదినిముషాలకి బండి కదులుందనగా ఓ తమాషా జరి
గింది. అంతవరకూ [illegible] స్టేషనులో తాతయ్య చెయ్యిపట్టుకుని
తిరుగుతున్న వాడల్లా సూర్యం తప్పిపోయి పార్శిలుగదిలో
తలుపు చాటున దాక్కుని తాతయ్యని చూసికూడ బయటికి
రాకుండా 'నాన్నగారూ' అని పిలుస్తూ దాగుడుమూత లాడిన
వైనమంతా తాతయ్య బండి కదిలేముందు తమాషాగా
పెద్దగా నవ్వుతూ చెప్పుకొచ్చాడు.

"ఊరుగో[illegible]డి. ప్రతాపం బాగనే ఉంది" అని
అమ్మమ్మ విసుక్కు[illegible]ంది.

సూర్యం [illegible]టివిగా నిటారుగా నిలబడి పైచూపులు
చూస్తున్నాడు. బండి కదిలిపోయింది.

# 2

అయిదు సంవత్సరాల తర్వాతమాట. నేను నాలుగో ఫారం పాసయి అయిదో ఫారంలోకి వచ్చాను. కామాక్షమ్మ పిన్ని కూతురు పెళ్ళికి అంతా రాజమండ్రి వెళ్ళాం. నా మనసులో డబ్బుల తాతయ్యని, అమ్మమ్మని, ముఖ్యంగా సూర్యాన్ని చూడాలని మహా తహతహగా ఉంది. ఇదివరకు మల్లే అరుగులమీద పడి ఎదురుతెన్నులు చూడకపోయినా కిటికీవార కూర్చుని వీధి మొగవైపు ఉడిగీ ఉడిగీ చూస్తూనే ఉండేవాడ్ని. డబ్బుల తాతయ్య పరిచయమున్న పిల్లలందరూ పెద్దవాళ్ళయి పోతున్నారు! కామాక్షమ్మ పిన్ని కూతురు రుక్మిణికి అప్పుడే పెళ్ళికూడా అయిపోతోంది. మరి కొంత మంది ఆ యీడు పిల్లలు కాపరానికూడా వెళ్ళిపోయారు. ఇలా మా జట్టులో నేనొక్కడ్నే మొగపిల్లల తరఫున తాతయ్యగురించి ఎదురుచూసేవాడ్ని అయిపోయాను. పెళ్ళి కూతురు రుక్మిణి వీధిలోకే వచ్చేదికాదు. అది పెద్ద పేరక్కలా పెద్దవాళ్ళ మధ్యనే కూర్చుని పెద్దపెద్ద కబుర్లు చెబుతూండేది.

డబ్బుల తాతయ్య వచ్చాడు. అమ్మమ్మ, సూర్యం కూడా వచ్చారు. కాని ఇదివరలా 'డబ్బుల తాతయ్య వచ్చాడు' అని గెంతుకుంటూ పోవటానికి నాకు సిగ్గేసింది. ఆయన్ని చూడగానే అంత ఉత్సాహమూ వచ్చిందిగాని

బయటికి ప్రదర్శించటానికి ఏదో అడ్డుపడినట్టయి 'తాతయ్యా' అని మటుకే పలుకరించాను.

తాతయ్య వెన్ను తట్టి "ఏరా మనవడా? ఉత్తి తాతయ్య అని పిలిచి ఊరుకున్నావేం?" అన్నాడు.

"డబ్బుల తాతయ్య అని పిలవాలిరా?" అంది అమ్మమ్మ ఎదురువస్తూను.

సూర్యం బాగా ఎదిగాడు. వాడిలోవచ్చిన మార్పల్లా అదొక్కటే అని నేను మొదటి చూపులోనే పసిగట్టేశాను.

తాతయ్యని పలకరించటానికి వచ్చిన రుక్మిణి వెనకాలే బంగిబంగి వెళ్ళి, ఆమె నిడుపైన పూలజడని పట్టుకొని ఒక్క గుంజు గుంజాడు సూర్యం.

రుక్మిణి 'అమ్మ బాబోయ్!' అంది ఒక్కమారు.

అందరూ అదిరిపడి అటు తిరిగారు.

తాతయ్య వాణ్ని దగ్గరగా తీసుకొని 'తప్పురా వెధవాయి' అంటూ మందలించాడుగాని అమ్మమ్మ ముఖంమీద కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు.

కామాక్షమ్మ పిన్ని "ఆరి భడవా ఇంకా అల్లరి మానేదురా" అంటూ నవ్వేసిందిగాని ఆ తర్వాత 'వాడిలా ఎదిగి ఇంకా ఏమిటా పిచ్చిపన్లు' అని గొణుక్కోవటం నేను విన్నాను.

సూర్యం నా దగ్గరకు వచ్చాడు. ఎదురుగ్గా కుర్చీ చూపించి కూర్చోమన్నాను. వాడు కుర్చీమీద గొంతు కూర్చుని వెకిలిగా నవ్వుతూ "నీకు దాగుడుమూతలాడటం వచ్చా?" అన్నాడు.

సమాధానం ఏం చెప్పాలో నాకు బోధపడలేదు.

సూర్యం "పోనీ ఎక్కాలు వచ్చా? నాకు అయిదో ఎక్కంవరకూ వచ్చు" అన్నాడు.

దానికీ ఏం చెప్పాలో బోధపడలా.

ఇంతలో తాతయ్య పొడుం పీల్చుకుంటూ అక్కడికి వచ్చాడు. తాతయ్య రాగానే సూర్యం కుర్చీమీంచి కిందకు ఒక్క గెంతుగెంతి తాతయ్య ఒళ్లో ఎక్కి కూర్చుని– "చూడు నాన్నా. వీడికి దాగుడుమూతలాడటం రాదుట. ఎక్కాలు చదవటం రాదుట. హి! హి.!!" అంటూ నవ్వసాగాడు.

తాతయ్య వాణ్ని యింకా దగ్గరగా తీసుకొంటూ "అదికాదురా పిచ్చినాన్నా. వాడు నీకంటె మంచి ఆటలే ఆడుతాడు. చదువులోకూడా నీకంటె బాగా పై చదువులోకి వెళ్ళాడురా" అన్నాడు.

"పైకంటె ఆకాశం మీదికా ?" అంటూ వేళాకోళంగా అనేసి సూర్యం ఉడుంగుమని అక్కణ్నించి పారిపోయాడు.

వాడి విషయంలో తాతయ్య ప్రవర్తన నాకు విచిత్రంగా తోచేది. ఆ సందడి సమయంలోకూడా వాడికి ఏ యిబ్బందీ రాకూడదని తాతయ్య ఉద్దేశ్యం. ఎవరు తిన్నా తినకపోయినా వేళకి వాడికి భోజనం అయిపోవాలి. వాడు ఫలానా పదార్థం కావాలంటే అది మడిలో ఉన్నాసరే ఏ ముసలావిడో మడిగట్టుకుని అది వాడిచేతిలో పడెయ్యాల్సిందే. అంతవరకూ వాడెంత ఆగం చేస్తాడో తాతయ్య దానికి రెట్టింపు చేసేస్తాడు.

"ఇంటి దగ్గర ఏం చేసినా బాగుంటుంది. ఇది సందడి సమయం. మనం ఇక్కడ గారంచేస్తే బాగుండదు. వాడ్ని కాస్త మందలిస్తూండండి. వాడుచేసే పనులు నాకు తలవంపులుగా ఉన్నాయి" అంటూండేది అమ్మమ్మ.

"పోవే. పిల్లలు అల్లరి చెయ్యకపోతే నువ్వూ నేనూ చేస్తావేఁవిటి?" అనేవాడు తాతయ్య.

"వాడికంటె చిన్నవాళ్ళు ఎలా ఒద్దికగా ఉన్నారో చూడండి. మన ఖర్మ కాకపోతే..." అని అమ్మమ్మ వాపోయేది. పెళ్ళయిన మర్నాడు నేను వీధిగదిలో కూచుని పత్రిక చదువుకుంటున్నాను.

ఉన్నట్టుండి మధ్యగదిలోంచి రుక్మిణిగొంతు తారస్థాయిలో వినిపించసాగింది. చప్పున లోపలికి వెళ్ళాను. రుక్మిణి మంచంకమ్మీకి కట్టేసిఉన్న జడని విప్పుకుంటూ సూర్యాన్ని తిట్టిపోస్తూంది. కామాక్షమ్మ పిన్ని రుక్మిణి నోరుమూసి "బాగుండదు. తిట్టకు. ఊరుకో." అంది.

అదృష్టవశాత్తు అమ్మమ్మ, తాతయ్య అక్కడ లేకపోవటంవల్ల సూర్యంచేసినపని ఆగం కాలేదు. రుక్మిణి నోరు పారేసుకోవటంతో సూర్యం కిలకిలా నవ్వుకుంటూ పెరట్లోకి పారిపోయాడు. ఎలా తెలిసిందో ఆ నోటా ఆ నోటా ఈ విషయం అమ్మమ్మ చెవినిపడింది. సాయంత్రం పెళ్ళికూతురు జడవెయ్యటానికి దువ్వెన్న తలమీదపెట్టగానే 'అబ్బా!' అంది రుక్మిణి. అదేమని చూడబోతే నిమ్మకాయంత బొప్పి చేతికి తగిలింది.

"అబ్బా ఎంత బొప్పికట్టిందే. ఉండు వాడిపని చెబుతా" అంటూ అమ్మమ్మ శివం పూనినట్టుగా లేచి పందిరి రాటల కెగబ్రాకుతూన్న సుర్యాన్ని చరచరా కిందికిలాగి నాలుగుదెబ్బలు వేసింది. సుర్యం అమ్మమ్మతో పెనుగులాడుతూ ఆవిడ ఖరీదయిన చీర చెరగు పట్టుకుని లాగటంలో అది పరపరా చిరిగిపోయింది. దాంతో ఆవిడ ఆవేశం కట్టలు తెగి కోపానికి చేతకానితనంగా మారి కన్నీరు గ్రుక్కుకుంటూ "ఒక చమువ్వా లేదు, చట్టుబండలూ లేదు. పైగా ఈ వెర్రి అల్లరేంవిటేరా!" అంటూ ఆమె గదిలోకి వెళ్ళిపోయింది.

సాయంత్రం తాతయ్య వాడ్ని వెనకవేసుకుని "ఎందుకే వాడ్ని కొట్టావుట?" అంటూ అమ్మమ్మని సంజాయిషీ అడిగాడు.

"కొట్టక ముద్దు పెట్టుకుంటారేంవిటి. చూడండి, వాడేం చేశాడో" అని అమ్మమ్మ చిరిగిపోయిన చీర పట్టుకు వచ్చి చూపించింది.

"ఆ మాత్రానికి వాడ్ని పట్టుకుని అంతంత దెబ్బలు కొడతావా?" అంటూ లేచాడు తాతయ్య.

ఇక ఈ ధోరణి ఎంతవరకూ పోతుందో అమ్మమ్మకి తెలుసు. ఇంతమందిలోనూ ఆయన చేత దెబ్బలు కూడా తినాల్సి వస్తుందనే పరిస్థితి రాకుండా ముందే జాగ్రత్త పడుతూ "రుక్మిణి నిద్రపోతుంటె దాని జడ మంచం కమ్మీకి కట్టేశాడు. అది లేవబోయి తల మంచంకోడుకు కొట్టుకుని ఇంత బొప్పికట్టింది. ముట్టుకుంటే పుండులా బాధపడుతూంది పాపం" అంది అమ్మమ్మ.

తాతయ్య తగ్గిపోయి రుక్మిణిని పలకరించి సూర్యాన్ని మందలించాడు_ "ఒరేయ్, ఇల్లాంటి పనులుచేస్తే ఇక నీకు బిళ్ళలు కొనియ్యను, నీకు సినిమాలు చూపించను. తెలిసిందా?" అంటూను.

ఆ మాత్రానికే సూర్యం బావురుమంటూ బాకా ఎత్తాడు.

నాకంటె పెద్దవాడు అలా ఏడుస్తుంటె నాకే సిగ్గనిపించి యివతలకి వచ్చేశాను. లోపల్నించి తాతయ్య వాడ్ని బుజ్జగించటం వినిపించింది.

సూర్యం ఈసరికి కాలేజీ చదువు చదువుతూండాల్సిన మాట. వాడి చదువింకా ఎక్కాల స్థాయిలోనే ఉన్నదంటే ఒక్కొక్కప్పుడు వాడ్ని చూస్తుంటే జాలి వేస్తూండేది కూడాను. అమ్మమ్మద్వారా విన్నదేవిటంటే వాడి చదువు కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి సాగనివ్వకుండా తాతయ్యా వాడూ కలిసి పాడుచేస్తున్నారని. బడికి పంపుతే పంతులు కొడుతున్నాడని వాడ్ని తాతయ్య బడి మానిపించేశాట్ట. ఇంటిదగ్గర ప్రయివేటు పెడితే ఒకపూట చదివి ఒకపూట చదవకా ఆయన్ని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తే ఆయన వేగలేక మానుకున్నాట్ట. ఇంటి ముందే ఒకాయన వీధిబడి పెడితే కంటిముందు ఉంటాడు గదా అని అందులో జేర్పిస్తే, చదువులేదు సరికదా చిన్న చిన్న దొంగతనాలు మొదలుపెడితే అవి రుజువయి పంతులుగారే తాతయ్యతో ఇక మీవాడ్ని నా దగ్గరకు పంపవద్దని చెప్పేశారుట. ఇలా అయిదారు గట్టిప్రయత్నాలని యిద్దరూ కలిసి

ధ్వంసం చెయ్యటంతో అమ్మమ్మ వాడికి నాలుగు అక్షరమ్ముక్కలు చెప్పాలని ప్రయత్నించిందిగాని అదికూడా సాగలేదు. వాడి చదువు విషయం ఎత్తితే "పోనిద్దూ, వాడే చదువుకుంటాడు. ఇప్పుడు వాడు బి. ఏ. పాసయి నీకు సంపాదించి పొయ్యాలా?" అనేవాట్ట తాతయ్య. ఈ విషయా లన్నీ అమ్మమ్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తూనే చెప్పింది. వాడి భవిష్యత్తు గురించి అమ్మమ్మ కున్న ఆందోళన తాతయ్యకెందుకు లేదా అనిపించింది. "అయితే ఆడదాని మాట ఆలకించే దెవరూ? మంచయినా చెడయినా చెప్పింది చెయ్యటానికే గాని చెప్పటానికి ఆడదెవత్తి?" అనికూడా అమ్మమ్మ అంది.

ఈ మారు డబ్బుల తాతయ్యకి మరొక పిల్లలజట్టు పరిచయం అయింది. మే మంతా దూర దూరంగా మసులుతుంటే "మీ రంతా పెద్దవాళ్ళయి పోయారుట్రా అప్పుడే? అవున్లే. అందరికంటె నేనే చిన్నవాణ్ని. సరే... సరే..." అంటూ తాతయ్య తల వూపుతూ నవ్వుతూండేవాడు.

నాకు ఎంతసేపూ పుస్తకాలు చదవటంతో సరిపోయేది. అన్ని పత్రికలూ పోగుచేసి చదువుతూండే వాణ్ని. తాతయ్య చిల్లరడబ్బులు కుప్పగా ముందుపోసుకుని పిల్లలకి పంచిపెడుతూనే ఉండేవాడు. ఆ చప్పుళ్ళు వింటుంటె చెయ్యి చాపటానికి సిగ్గుగా అనిపించినా తాతయ్య నాకూ ఇస్తే బాగుండునే అనిపించేది. తాతయ్య మా సంగతే పట్టించుకునేవాడు కాదు.

పెళ్ళయిన వారానికల్లా మేం మళ్ళీ విశాఖపట్నం వెళ్ళి పోయాం.

# 3

నేను ఆనర్సు పూర్తి చేశాను. ఇంకా పైకి చదవాలని ఉందిగాని నాన్న ఒక్క రెక్కమీద సంపాదించారు. ఇక ఇక్కడితో చాలు అనుకున్నాను. అనువైన ఉపాధ్యాయ పదవికి పోవాలని కాలేజీ లన్నిటికి ధరఖాస్తులు పెట్టుకొన్నాను. క్లాసులో పాసయ్యాను కనక ఏదో ఓ కాలేజీ అవకాశ మిస్తుందని ఎదురు చూస్తున్నా.

రుక్మిణి ఆమె భర్త, ఇద్దరు పిల్లలతో విశాఖపట్నం వచ్చింది. ఆవిడ ఆడబడుచు పెళ్ళికని వచ్చింది. రెండురోజులు మాయింట్లో ఉంది. ఆ మాటా ఆ మాటా చెబుతూంటే డబ్బుల తాతయ్య ప్రసక్తి వచ్చింది.

నేను చదువుతూన్న పుస్తకాన్ని చట్టునమూసి వాళ్ళ దగ్గరకు పోయి కూర్చున్నాను.

“తాతయ్య పరిస్థితి మునుపట్లా లేదు పాపం. సంపాదించినన్నాళ్ళూ వెనకా ముందూ చూసుకోకుండా ఖర్చు చేసేశాడు. అమ్మమ్మ మొదట్నించీ చెబుతూనే ఉంది. ఆడమాట వింటేనా? రిటైరయ్యాడు. వచ్చిన ప్రావిడెండు ఫండుతో చిన్న ఇల్లు మాత్రం కొనుక్కున్నాడు. గృహ ప్రవేశానికి ఎవర్నీ పిలవలేక పోయానే అని చాలా బాధ పడ్డాడు. ఉండటానికి నీడయితే ఉంది. భుక్తిమాట?”

“అయితే సూర్యం చేతి కందలా?”

"అయ్యో రాత. వాడి సంగతే చెప్పుకోవాలి. ఖర్మ!" అంటూ నోరు నొక్కుకుంది రుక్మిణి.

"అదేవిటే అలాగంటావు. వాడు మన లక్ష్మణరావు ఈడువాడు కాదూ? ఎంతవరకూ చదివాడేవిటి?" అంది అమ్మ.

"చదువూ లేదు, చట్టుబండలూ లేదు. తినటం, తిరగటం." అంది రుక్మిణి పిల్లవాడ్ని కాళ్ళమీద వేసుకుని జో కొడుతూను.

"అయితే వాడిక ఎందుకూ పనికిరాడంటావేవిటే?" అంది అమ్మ ఆందోళనగా.

రుక్మిణి నోరు చప్పరించి "అలాగే ఉంది చూస్తూంటే.?" అంది.

వాడిలా కావటానికి బాధ్యులెవరో నాకు తెలుసు. రుక్మిణికూడా ఆ మాటే అంది. "పిల్లల్ని అందరం ముద్దు చేస్తాం. అంతగా నెత్తి కెక్కించుకుంటే అలాగే అవుతారు. పిల్లల పెంపకంలో ముద్దు చేసినప్పుడు ముద్దూ చెయ్యాలి; మందలించాల్సినప్పుడు మందలించాలి. పిల్లలకి ఏం తెలుస్తుంది పాపం! మనమే వాళ్ళని ఓ మార్గంలో పెట్టాలి."

ఆఖరికి నేనూ రుక్మిణీకూడా తాతయ్యని విమర్శించే వాళ్ళం అయిపోయాం. ఒకప్పుడు మేం ఇద్దరమూ ఆయన వీపులమీద ఎక్కి ఆట్లాడినవాళ్ళమే; ఆయన దగ్గర డబ్బులకోసం ఆరాటపడినవాళ్ళమే.

రుక్మిణి ఇంకా చాలా విషయాలు చెప్పింది.

సూర్యాన్ని ఆ మధ్య ఓ వర్కుషాపులో చేర్పించా

రట. చేరిన మర్నాడే ఇనపదూలం కాలిమీద వేసుకుని, కాలు విరిగినంత పనయితే షాపుకి వెళ్ళటం మాన్పించేశారట.

"చిన్నప్పట్నించి కాస్త భయభక్తుల్లో పెంచి ఉంటే నలుగురుతోపాటే వాడూ నాలుగు ముక్కలు నేర్చుకుని బాగుపడేవాడా? నువ్వన్నట్టు వాడ్ని అనుకుని ఏం ప్రయోజనం లేదే. అంతా మన తప్పు. పాపం! నూరేళ్ళు నెట్టాలి. ఏమయిపోతాడో!" అంటూ వాపోయింది అమ్మ.

# 4

విజయవాడ కాలేజీవాళ్ళు ఇంటర్వ్యూకి రమ్మనమని ఆహ్వానించారు. చిన్న బెడ్డింగుతో బయల్దేరాను. బయల్దేరే ముందు తాతయ్యకు ఓ కార్డుకూడా వ్రాశాను. అన్నట్టుగాను స్టేషన్లోదిగగానే తాతయ్య ప్లాట్‌ఫారంమీద హాజరు! నేను దిగకుండానే గట్టిగా కౌగలించుకుని "ఎంతటివాడి వైపోయావురా!" అంటూ వల్లమాలిన అభిమానంతో ఉక్కిరి బిక్కిరి చేసేశాడు. నా మనసంతా ఆర్ద్రభావాలతో నిండిపోయింది. తాతయ్య బాగా కుంచించుకుపోయి ఒడిలిపోయాడు. తల బాగా నెరిసిపోయింది.

"పెద్దవాడివి, స్టేషనుకి శ్రమపడి దేనికి రావటం?" అన్నాను, బెడ్డింగు బండివాడికి అందిస్తూ.

"అదేఁవిటిరా. నా మనసు ఆగుతుందా" అన్నాడు తాతయ్య.

బండి ఇంటికి చేరేసరికి వీధి గుమ్మంలో నిలబడి అమ్మమ్మ ఎదురు చూస్తోంది. "ఒచ్చావా నాయనా! ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి" అంటూ పలకరించింది.

ఇల్లు కుదిమట్టంగా ఒక చిన్నసంసారం ఉండటానికి అనువుగానే వుంది. చుట్టూ అందంగా మొక్కా మోడూ పెంచుకుందుకు విశాలమైన పెరడుకూడా వుంది.

భోజనందగ్గర తాతయ్య తను రిటైరు కావటం, తోటి ఉద్యోగులు తనకి ఘనంగా విందు చెయ్యటం, ఈ ఇల్లు కొనటం అంతా వర్ణించి చెప్పుకుపోతున్నాడు. అమ్మమ్మ వడ్డన చేస్తూంది, మధ్య మధ్య తాతయ్య మాటలకి నవ్వుతూను.

ఇంతవరకూ నేను సాహసించి సూర్యం ప్రసక్తి తీసుకురాలేను. తాతయ్య కూడా ఆ ప్రసక్తి తీసుకురాలేదు. చివరకి నేనే "సూర్యం ఎక్కడికి వెళ్ళాడు?" అన్నాను.

ఈ ప్రశ్నలో ఏముందోగాని అమ్మమ్మ ముఖం ముడుచుకుపోయింది. తాతయ్య, చేతిలో ముద్ద చేతిలోనే పట్టుకుని "వాడి సంగతే అడిగావూ? ఒట్టి అప్రయోజకుడై వీధులవెంట బలాదూరు తిరగడానికి పోయాడు. వాడ్ని నా కొడుకని చెప్పుకుంటే కూడా పరువు తక్కువ." అంటూ మొదలు పెట్టాడు.

అమ్మమ్మ పట్టిన పొయ్యిముందునించి తాతయ్యవైపు తిరిగి "ఎందుకలా వాడ్ని ఆడిపోసుకుంటారు. చిన్న

ప్పుడు నేను చెవిని యిల్లుకట్టుకుని పోరితే విన్నారూ? గారం చేసి, వాడి చదువుసంగతే పట్టించుకోక వాడ్నిలా చేసింది మీరే. వాడ్నెందుకు తిట్టటం?” అంది.

“ఊ! సర్లేద్దూ. నీకు నేనొకడ్ని దొరికాను. గడి గడికీ యిలా నువ్వు అంటుంటె నాకెంత కష్టంగా వుంటుందో నీకు తెలిసినట్టులేదు” అన్నాడు తాతయ్య.

“పదిమంది ముందూ అలా వాడ్ని చులకనచేసి మాట్లాడితే నాకు మటుకు కష్టంగా వుండదూ?”

“వాడు నీకేకాదు, నాకూ కొడుకే. ఆ విషయం మర్చిపోయినట్టున్నావు” అంటూ తాతయ్య గోడకి చారబడ్డాడు.

“అందుకే కాబోలు వాడ్ని గురించి అంత తేలిగ్గా మాట్లాడుతున్నారు.”

తాతయ్య నావైపు తిరిగి “బరితెలా పాతికేళ్ళు పైబడ్డాయి. అక్షరజ్ఞానం లేదు. వేళకి భోజనానికి మటుకు హాజరౌతాడు. నేనా పెద్దవాడ్నైపోతున్నాను. ఎన్నాళ్ళని సంపాదించగలను చెప్పు. సంపాదించగలిగినన్నాళ్ళు సంపాదించాను. ఉండటానికి నీడకోసం ఓ యిల్లు ఏర్పాటుచేశాను. ఇంకా సంపాదించాలంటె ఒంట్లో శక్తి ఉండద్దూ? ఈ వయసులో తండ్రికి చేదోడు వాదోడుగా వుండి బాధ్యత నెత్తిని వేసుకోవాల్సిన మాట. ఇలా పనీపాటూ లేకుండా తింటూ కూర్చుంటే నేను మటుకు ఎక్కడ్నించి తేగలను చెప్పు!” అన్నాడు.

9)

అమ్మమ్మ కళ్ళు తుడుచుకుంటూ "నాయనా వింటున్నావా? అప్పుడా వరస; ఇప్పుడీ వరస. అప్పుడు వాణ్ణి పల్లెత్తుమాట అనటానికివీలుండేదా? కొట్టినంతపని చేసేవారు. ఇప్పుడు ఆ నోటితోనే వాణ్ణి యిలా అంటున్నారు. వాడు వింటే ఎంత బాధపడతాడు చెప్పు" అంది.

"పడితే పడమను. అప్పటికైనా బుద్ధివస్తుందేమో చూస్తాను" నావైపు తిరిగి "నేను గారంచేసి పాడుచేశానంటుందేమిట్రా వాణ్ణి. నేను చదువుకో వద్దన్నానా?" అన్నాడు తాతయ్య.

అసలీ ప్రసక్తి ఎందుకు తెచ్చానా అనిపించింది నాకు. గబగబా భోజనం ముగించేశాను. "అబ్బాయ్, బడలికమీద వున్నావు. హాయిగా కాసేపు పడుకో" అని అమ్మమ్మ మధ్య గదిలో పక్క వేసింది.

పడుకుని ఆలోచిస్తూ వుండిపోయాను; అమ్మమ్మ వంటగదిలో చేసే చప్పుళ్ళు వింటూను. చిన్నప్పుడు సూర్యాన్ని అంతగా గారంచేసిన తాతయ్య యిప్పుడెందుకిలా అసహ్యించుకుంటున్నాడు? అమ్మమ్మలో లేనిమార్పు తాతయ్యలోనే ఎందుకు కలగాలి? డబ్బు ఒడుదుకులా? వయసుమీరి శక్తి ఉడిగి రాబడి తగ్గిపోయేసరికి ఆదుకునే వయసు వున్నా కొడుకు అప్రయోజకుడయాడనే ఆవేదనా? ఆ విషయం తాతయ్యకి యిప్పుడే తెలిసివచ్చిందా? ఆ దూర దృష్టి ముందేవుంటే అసలు వ్యవహారం యింతవరకు వచ్చేదే కాదుగా. ఇలా ఆలోచిస్తూ నే నిద్రపోయాను. తిరిగి నాకు

మెలుకువ వచ్చేసరికి అమ్మమ్మ, తాతయ్య మాటలు వినిపించాయి. అలా పడుకునే వినసాగాను.

"రాత్రికి ఉత్తి పచ్చడి మెతుకులే వేసిపెట్టనా. బాగుంటుందా?" అంది అమ్మమ్మ.

"ఒక్కపూట ఎలాగో సర్దుదూ. దగ్గర చిల్లిదమ్మిడి లేదు. రేపు అప్పు పుట్టించుకురావాలి ఎక్కడయినా" అంటున్నాడు తాతయ్య.

"మనలో మనం అయితే ఉన్నదేదో తింటాం. అతను..."

తాతయ్య అడ్డుపడుతూ "సర్లేద్దూ, ఒక్కపూటకి ఫర్వాలేదులే" అంటూ యివతలకి వచ్చాడు.

ఆ మాటలు వింటుంటె గుప్పెళ్ళకొద్దీ చిల్లర కోటు జేబులోంచి తీసి ముందుపోసుకుని పిల్లలకి పంచిపెట్టే తాతయ్యేనా యీ తాతయ్య అనిపించింది. అమ్మమ్మ ఎప్పుడూ ఒక లాగానే వుంది. సంసారాలు ఎప్పుడూ ఒకలాగా వుండవు. అందుకనే కాస్త ముందు చూపు అవసరం. 'డబ్బు వస్తున్నప్పుడు ఎంతఖర్చు చేసినా మనకి తెలిసిరాదు. అది లేనినాడు మన అసలు స్వరూపం బయట పడిపోతుంది' అని మనసులోనే అనుకుని వంటగదివైపు నడిచాను.

మధ్యాహ్నం ఎండ మిటమిట లాడుతోంది. సూర్యం అప్పుడే లోపలికి వస్తూ 'ఏరోయ్' అంటూ బుజంమీద చెయ్యివేసి ఒక్క గుంజు గుంజాడు.

వాడ్ని చూస్తుంటే చిన్నప్పుడు వాడు చేసిన అల్లరంతా గుర్తుకు వచ్చింది.

తాతయ్య హాలులోపల గుర్రుపెడిచి నిద్రపోతున్నాడు. అమ్మమ్మ పెరట్లో బట్టలు ఉతుక్కుంటూంది. సూర్యం కంచం పెట్టుకుని తానే అన్నంవడ్డించుకుని భోజనం చేస్తూ, "రారా యిలా వచ్చి కూర్చో" అంటూ నన్ను పిలిచాడు.

"ఒరేయ్ నువ్వు లెక్చరరు వయితే నాకు ఊరికే చదువు చెబుతావట్రా?" అన్నాడు సూర్యం వున్నట్టుండి.

"ఏం? నీకు చదుకోవాలని వుందా?" అన్నాను.

"ఆహా! చెబుతావా? అసలు ఎన్నాళ్ళు పడుతుందంటావ్ ?"

"శ్రద్ధగా చదువుకుంటె రెండు మూడు సంవత్సరాల్లో వచ్చేస్తుంది."

"పుస్తకాలకీ వాటికీ డబ్బు బాగా కావాలా?"

"అక్కర్లేదు. పుస్తకాలు నే తెచ్చిపెడతాగా."

అమ్మమ్మ తడిగుడ్డలు బుజాన వేసుకుని రొప్పుకుంటూ లోపలికొచ్చి "నన్ను పిలవకపోయావా నాయనా. నేనొచ్చి అన్నం పెట్టేదాన్నిగా" అంది కొడుకుతో.

సూర్యం మాట్లాడకుండా తల వంచుకున్నాడు.

"ప్రతిరోజూ యిలా వేళాపాళా లేకుండా అన్నం తింటే ఆరోగ్యం పాడయిపోదూ?" అంటూ గొణుక్కుంటూ అమ్మమ్మ బట్టలు ఆరెయ్యటానికి ముందు దొడ్డిలోకి వెళ్ళింది.

సూర్యం భోజనంచేసి ముందు వరండాలోకి పోయి కటికి నేలమీద పడుకున్నాడు. అమ్మమ్మ వాణ్ని సమీపించి ఏదో చెప్పటం, వాడు చేతులువూపుతూ నిర్లక్ష్యంగా గోడ

వైపుకి వత్తిగిలటం నేను కిటికీలోంచి గమనిస్తూ వున్నా. అమ్మమ్మ తల మొత్తుకుంటూ లోపలికి వచ్చి పక్కగుడ్డలు తీసుకుని వాడి కివ్వబోయింది. వాడు తిరస్కరిస్తూ అక్క డ్నించి లేచి కొద్దిదూరంగాపోయి పడుకున్నాడు.

సాయంత్రం చల్లబాటువేళ నేను ఊరుచూద్దామని బయల్దేరాను. సూర్యం అంతకుముందే బయటికి వెళ్ళి పోయాడు. చిన్నప్పుడు ఎప్పుడో చూసిన పట్నం. ఇప్పుడు బాగా మారిపోయింది. నేను తిరిగి తిరిగి చీకటి పడేవేళకి యింటికి చేరుకున్నాను. తాతయ్య యింట్లో లేడు. అమ్మమ్మ వక్కతీ వంటగదిలో కూర్చుని భజన పాటలు పాడుకుం టూంది.

నేను ఆమె యెదురుగ్గా పీట వేసుకుని కూర్చు న్నాను.

అమ్మమ్మ భగ భగ మండే పొయ్యి ముందునించి నావైపు తిరిగి "చూస్తున్నావుగా నాయనా, ఆ తండ్రీ కొడు కుల వరస. ఈడువచ్చినవాడ్ని అలా అంటుంటె వాడికి అభి మానంగా వుండదూ? ఇప్పు డిద్దరికీ మాటల్లేవు. వాడు ఆ వరండాలోనే గడుపుతున్నాడు. ఇంట్లోకి రాడు. నా కడుపు తరుక్కుపోతోందంటె నమ్ము" అంది.

నేను ఏమనగలను? "అవు నమ్మమ్మా. అంతా చూస్తూనే వున్నా" అని మటుకు సమాధానం చెప్పాను.

అమ్మమ్మ కంఠం తగ్గించి "పెదవారు. ఆయనమీద నేరం చెబుతున్నానని కాదుగాని, వాడి విషయంలో ఆయన

పద్ధతి మొదట్నించి నాకు నచ్చటం లేదనుకో. ఆయన వల్లనే వాడు యిలా అప్రయోజకు డయ్యాడు. ఇప్పుడు వాడ్ని ఓ దారిలో పెట్టి వాడి జీవితం మనం కాపాడాలిగాని, వాడ్ని పట్టుకుని అడ్డమయిన మాటలూ అంటే ఒరిగేదేమిటి? ఆయన ధోరణి నాకు భయంగాకూడా వుంది" అంది.

మసిబారిపోయిన గోడవారగా పైపైకి పోతున్న పొగ వైపు చూస్తూ యీ తాతయ్య మన సత్యాన్ని గురించి ఆలోచిస్తూ వుండిపోయాను. అమ్మమ్మ ఏవేవో తలపులతో కళ్ళు చెమర్చుకుంటూ, చీరచెంగుతో వత్తుకుంటూ వంటపనిలో నిమగ్నురాలయిపోయింది.

# 5

మర్నాడు ఉదయం నా యింటర్వ్యూ పూర్తయింది. తృప్తిగా సమాధానా లిచ్చాను. ఫలితం తర్వాత తెలియబరుస్తామన్నారు. తప్పకుండా సెలక్టవుతాననే ధైర్యం నాకుంది. ఆ ఉత్సాహంతోనే యింటికి వచ్చానుగాని తాతయ్య ముఖం చూసేసరికి అంతా అణిగిపోయింది. తాతయ్య ఎర్రబడిన ముఖంతో అగ్గిరుద్రు డయిపోయి "పోనివ్వవే. వాడెలా ఛస్తే ఎవడికి కావాలంట. పోతే పోనీ. ఉండి వాడు ఉద్ధరించే దేమిటి?" అంటూ అరుస్తున్నాడు.

అమ్మమ్మ కన్నీరు గ్రుక్కుకుంటూ గుమ్మంవార కూచుని వుంది.

నన్ను చూడగానే తాతయ్య "అబ్బాయి, నీతో ఓ విషయం మాట్లాడాలిరా. ఇలా గదిలోకిపోయి కూర్చుందాం పద" అన్నాడు.

గదిలో తాతయ్య దగ్గరగావచ్చికూర్చుని "నాన్నతో నాకు ఓ చిన్న ఉద్యోగం ఏదయినా చూసిపెట్టమని చెప్పాలిరా. కనీసం ఏభయిరూపాయిలొచ్చినా చాలు. మరీ మరీ అడిగానని చెప్పు" అన్నాడు.

ఆ ముఖంలో దైన్యం చూడలేక "మళ్ళీ ఉద్యోగం చెయ్యటానికి ఓపిక ఉందా తాతయ్యా?" అన్నాను.

"లేదనుకో. అయినా తప్పదుగా మరి. సంసారం గడవద్దూ?" ఇక నేను మాట్లాడలేకపోయాను. "అలాగే చెబుతాను" అని మటుకు అన్నాను.

"అయితే యింతకీ నీ ఇంటర్వ్యూ సంగతి చెప్పలేదు, ఏమయింది?"

"మూడు వంతులు సెలక్టవుతా ననే నా నమ్మకం" అన్నాను.

"మంచిది నాయనా. మీ నాన్న అదృష్టవంతుడు" అన్నాడు తాతయ్య.

అప్పుడు తాతయ్య దురదృష్టవంతుడే. అయితే అది స్వయంకృతం. తాతయ్య వెళ్ళిపోగానే అమ్మమ్మ గదిలోకి వచ్చి "నాయనా ఒక్క సహాయం చేసిపెట్టాలిరా" అంది ఆతృతగా.

"ఏమి టమ్మమ్మా?"

"అబ్బాయికి, తాతయ్యకి మాటా మాటా వచ్చింది. తాతయ్య వాడ్ని తిట్టకూడని తిట్లన్నీ తిట్టారురా. కొట్టటానికి మీదికి కూడా వెళ్ళారు. ఇక మీ గుమ్మం తొక్కనంటూ వెళ్ళిపోయాడ్రా. కాస్త వాడ్ని వెతికి బుజ్జగించి యింటికి తీసుకురా నాయనా. ఏమయిపోతాడో నా బిడ్డ. మనసు కుళ్ళిపోతోంది నాయనా."

నేను వీధిలోపడి వీధి వీధి గాలించసాగాను. ఎక్కడున్నాడని వెతకను? ఇంత పెద్ద పట్నంలో వాడి జాడ ఎలా తెలుసుకోగలగటం? అయినా అమ్మమ్మ తృప్తికోసం వాడ్ని ఎలాగయినా పట్టుకుని యింటికి తీసుకురావాల్సిందే అనే పట్టుదలతో తిరుగుతున్నా.

ఒక పెద్ద హోటలుముందు గుంపుగా జనం చేరివుంటే అక్కడికి వెళ్ళాను. జనం మధ్య పధ్నాలుగు సంవత్సరాల కుర్రవాడొకడు తల వంచుకుని నిలబడి వున్నాడు. వాడిని దగ్గరికి తీసుకుంటూ ఓ స్త్రీ కళ్ళు వత్తుకుంటూంది. హోటలు యజమాని చెబుతున్నాడు: "ఇకనైనా జాగ్రత్తగా పెంచుకో తల్లీ. కుర్రవాడు మంచివాడు, బుద్ధిమంతుడూను. తండ్రి వాడ్ని పట్టుకుని అంతలా హింసిస్తే వాడు యిల్లువిడిచి పారిపోక ఏం చేస్తాడు? అంతా మనలో వుంటుందమ్మా. అవసరమయితే పిల్లల్ని అందరం మందలించుకుంటాం. మరీ యింత చేటు బాడుకుంటే పసివాళ్ళు తట్టుకోగలరా?" అంటూ హితబోధచేసి ఆ తల్లీ కొడుకుల్ని ఓ బండి ఎక్కించి పంపించాడు. ఆనోటా ఆనోటా నేను విన్నది: ఆ కుర్రవాడ్ని వాడి

తండ్రి విపరీతంగా హింసించేవాట్ట. భయపడిపోయి తట్టుకోలేక ఆ కుర్రాడు పారిపోయి ఈ వూళ్ళో హోటల్లో క్లీనర్‌గా చేరాట్ట. ఆ తల్లి వూరువూరూ గాలించుకుంటూ వచ్చి ఇక్కడ పట్టుకోవడం జరిగింది. అదీ కథ.

నిట్టూర్చి అక్కణ్నించి కదిలాను. అమ్మమ్మ ప్రాథేయ పూర్వకమైన స్వరం నా చెవిలో మళ్ళీమళ్ళీ వినిపిస్తోంది.

ఊరివెలుపల పాక మధ్యనించి పోతున్నాను. ఎండ భగభగ మంటూంది. కాళ్ళు తీపులు పుడుతున్నాయి. ఒళ్ళంతా ఎండవేడికి కమిలిపోతూంది. నుదురు వత్తుకుంటూ గుట్టలూ మెట్టలూ దాటుకుంటూ మనిషి మనిషినీ పరిశీలిస్తూ సాగిపోతున్నాను. ఆ పసికుర్రవాడి దీనవదనం, ఆ తల్లి చారికలు కట్టిన ముఖమూ నా కంటిముందు మెదుల్తున్నాయి. సూర్యం దొరక్కపోతే, వాడు పంతగించి ఇక ఇంటికి రాక పోతే, తాతయ్య మటుకు జీవించగలడా?

మురుగువాసన ముక్కు బద్దలుచేస్తుంటే గబగబ ఆ ప్రదేశాన్నుంచి తప్పుకుని పెద్దవీధిలో కొచ్చి పడ్డాను. మొగలో పెద్ద పాకలో వీధిబడి సాగుతోంది. మాస్టరుగారు ఎత్తయిన అరుగుమీద కూర్చున్నారు — పిల్లలు గొణగణా చదువుకొంటున్నారు.

గోడవార పంపుదగ్గర నీళ్ళు తాగుదామని వంగాను. నాలుక పీక్కుపోతోంది. అరుగువార నీడలో పిల్లలమధ్య ఓ పెద్దవ్యక్తి కనుపించాడు. గొంతు తడారిపోతున్నా చప్పున పంపుమీంచి చెయ్యితీసి పాకలో చొరబడ్డాను.

మాష్టరు కునికిపాట్లు పడుతున్నాడు. పిల్లలు చప్పున పుస్తకాలు, పలకలూ మూసి నావైపు మౌనంగా చూస్తూ ఉండిపోయారు.

ఆ వ్యక్తి నన్నుచూసి చేతిలో పుస్తకాన్ని కిందపడేసి తల వంచుకొని వెక్కి వెక్కి ఏడవటం విన్నాను. సూర్యాన్ని పోల్చగలిగాను.

"సూర్యం, నీ భవిష్యత్తు గురించి నేను హామీ ఇస్తున్నాను. దిగులుపడకు. నీకు చదువు నే చెబుతాను. మంచి ఉద్యోగం నే యిప్పిస్తాను. నా మాట నమ్ము. రా యింటికి పోదాం" అన్నాను. వాడు మాట్లాడలేదు. వాడి చేతిలోంచి జారి క్రిందపడ్డ తెల్లకాగితాల పుస్తకం తీసుకుని "లెఖ్ఖలు చేస్తున్నావా?" అన్నాను.

సూర్యం అవునన్నట్టుగా తలవూపాడు. మాష్టరుగారు అప్పుడే మేల్కొన్నారు కాబోలు—కళ్ళు నలుపుకుంటూ మావైపు చూడసాగారు అయోమయంగా.

—'భారతి' నుండి.